

సహకార సంఘాల్లో సకల సేవలు



2



2

బీర్కూర్‌లో దొంగల హల్‌చల్



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

13-6-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## 14న విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో టౌన్ ఏడీఈ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. నగరంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లలో 33కేవీ ఇంటర్ లింకింగ్ లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. ఎన్టీఆర్ చౌరస్తా నుంచి మిర్చి కాంపౌండ్ సబ్‌స్టేషన్ వరకు పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. 11కేవీ కలెక్టర్ కార్యాలయం, కాంగ్రెస్ భవన్, కవిత కాంప్లెక్స్, 11కేవీ రైల్వే ఫీడర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## అర్ధరాత్రి చోరీ.. గంటల్లోనే దొంగను పట్టుకున్న పోలీసులు



**అక్షరటుడే, కామారెడ్డి:** అర్ధరాత్రి జరిగిన చోరీ కేసును గంటల వ్యవధిలో పోలీసులు ఛేదించారు. ఈ ఘటన కామారెడ్డి పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి శుక్రవారం రాత్రి ఇంటికి తాళం వేసి ఆరుబయట పడుకున్నాడు. అర్ధరాత్రి తర్వాత చప్పుడు కావడంతో లేచి చూడగా ఓ వ్యక్తి ఇంట్లో సామాన్లు సర్దుతూ కనిపించాడు. ఇంటి యజమాని వెంటనే డయల్ 100కు కాల్ చేశాడు. దొంగతనం చేసే వ్యక్తి వేసుకున్న దుస్తుల రంగులు, అతని ఆనవాళ్లు పోలీసులకు వివరించాడు. పోలీసులు కంట్రోల్ రూమ్ సిబ్బంది, నైట్ పెట్రోలింగ్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. లింగాపూర్ నుంచి బయటకు వచ్చే ప్రధాన రహదారులన్నీ బ్లాక్ చేశారు. ఇంటి యజమాని చెప్పిన గుర్తులతో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడు రామారెడ్డి మండలం కన్నాపూర్‌కు చెందిన రాథోడ్ బుజ్జిగా గుర్తించిన పోలీసులు చోరీ చేసిన రూ.2,500 నగదు, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. అతనిపై దేవునిపల్లి, నిజామాబాద్ నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు కాగా జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. నిందితుడిని పట్టుకున్న సిబ్బందిని ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించి రివార్డు అందజేశారు.





## వేగంగా మార్కెట్ కమిటీ భవన సముదాయం పనులు..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రైతులు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.87 లక్షలతో భవన సముదాయం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. శనివారం మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి నిర్మాణ పనులను పర్యవేక్షించారు. వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కొత్తగా 9 భవన సముదాయాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పనులను ప్రారంభించి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వాటితోపాటు మార్కెట్ కమిటీ కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. దీంతో రైతులు, వ్యాపారులకు అన్ని సేవలు ఒకే చోట అందుబాటులోకి రానున్నాయి. రైతులు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్ ప్రోత్సాహంతో పనులను కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

### షబ్బీర్ అలీకి వార్నింగ్

ఫిర్యాదు అనంతరం మీడియాతో మాట్లాడిన ఇందుప్రి య ఘాటు వ్యాఖ్యలు చేశారు. తన ఎదుగుదలను ఓర్వలేకే ఇలాంటి కుట్రలు చేస్తున్నారంటూ మండిపడ్డా రు. షబ్బీర్ అలీ కొడుకు, ఆయన అన్న కొడుకు, మరికొం త మంది తనపై ట్రోలింగ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదంతా షబ్బీర్ అలీ చేయిస్తున్నారని, ఆయన రాజకీయాల్లో పనికి రారని, ఖబర్దార్ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆమె చేసిన డైరెక్ట్ వార్నింగ్ జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

### షబ్బీర్ అలీ వర్గం ఫైర్

ఇందుప్రియ వ్యాఖ్యలపై షబ్బీర్ అలీ వర్గం మండిపడుతోంది. నిరాధార ఆరోపణలు మానుకోవాలని.. బీఆర్ఎస్‌లో సస్పెండ్ చేస్తే పార్టీలో చేర్చుకుని పదవులు ఇప్పించిన నాయకుడిపైనే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని ఫైర్ అవుతున్నారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీ చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియర్ నేతల మధ్య ఈ మాటల యుద్ధం క్యాడర్‌లో గందరగోళం సృష్టిస్తోంది. తాజా పరిణామాలతో మరింత బలహీనపడే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



**కామారెడ్డి కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు మరోసారి భగ్గుమన్నాయి. నేతల మధ్య అంతర్గతంగా రగులుతున్న అసమ్మతి జ్వాలలు ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా బహిరంగ యుద్ధానికి దారితీశాయి. ఇప్పటికే టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మధ్య పరస్పర ఫిర్యాదుల పరంపర కొనసాగుతుండగా మధ్యలో చంద్రశేఖర్ రెడ్డి సతీమణి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ వైపు టర్న్ తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఆమెపై కొందరు సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్నారు. - అక్షరటుడే, కామారెడ్డి**



# కాంగ్రెస్‌లో సోషల్ వార్

- నాయకుల మధ్య మాటల యుద్ధం
- అసభ్యకర పోస్టులపై మాజీ ఛైర్‌పర్సన్ ఫిర్యాదు
- షబ్బీర్ అలీకి డైరెక్ట్ వార్నింగ్‌పై జోరుగా చర్చ
- నిరాధార ఆరోపణలపై షబ్బీర్ వర్గం ఫైర్
- రచ్చకెక్కుతున్న కామారెడ్డి కాంగ్రెస్ వర్గపోరు

మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో ఓ పత్రికలో వచ్చినట్టుగా అసభ్యకరమైన పోస్టింగ్ ఒకటి చక్కర్లు కొట్టింది. దాంతో ఇప్ప టికే ఉన్న వివాదం కాస్త మరింత పెద్దది అయింది. తన ఎదుగుదలను ఓర్వలేక టార్గెట్ చేయడం వెనక ఉన్న వ్యక్తులకు ఖబర్దార్ అంటూ ఆమె వార్నింగ్ ఇవ్వడం తీవ్ర చర్చకు దారి తీసిందన్న టాక్ వినిపిస్తోంది.

### ఆడియోతో మొదలైన వివాదం

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడినట్టు ఓ ఆడియో సోషల్ మీడియాలో ఇటీవల వైరల్ అయ్యింది. అందులో పార్టీతో పాటు టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు మరోసారి రచ్చకు తెరలేపాయి. దీనికి కొనసాగింపుగా గడ్డం ఇందుప్రియపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ మొదలైంది.

### అసభ్యకర పోస్టు కలకలం

ఫేస్ బుక్ వేదికగా కామారెడ్డి జిల్లా పేజీలో ఇందుప్రియ మీద ఓ పత్రికలో వచ్చినట్టుగా క్రియేట్ చేసిన అసభ్యకర కంటెంట్ పోస్ట్ చేశారు. ఆమెను టార్గెట్ చేస్తూ వాట్సాప్ గ్రూపుల్లో, ఫేస్‌బుక్‌లో దానిని వైరల్ చేశారు. కాంగ్రెస్ గ్రూపుల్లో దానిని పోస్ట్ చేయడం గమనార్హం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఇందుప్రియ వెంటనే స్పందించా రు. తనపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నేరుగా జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

### షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు..

పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారనే ఆరోపణలపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి టీపీసీసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇటీవల షబ్బీర్ అలీపై వచ్చిన అవినీతి ఆరోపణలు, ఓ మహిళా నాయకురాలిని ఉద్దేశించి చేసిన కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలోనే ఆయనకు వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. కొన్ని రోజు లుగా సదరు సీనియర్ నేత చేసిన వ్యాఖ్యలపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. ముఖ్యంగా మహిళా నేతపై ఆయన వ్యవహరించిన తీరు, మాట్లాడిన మాటలు సరికావని పార్టీ అంతర్గత సంభాషణల్లోనే కాకుండా, బహిరంగంగానూ విమర్శలు వచ్చాయి. కాగా.. గతంలో షబ్బీర్ అలీ వ్యాఖ్యలపై బహిరంగంగా స్పందించి.. ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడిన పీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డికి కూడా పీసీసీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన శుక్రవారం క్రమశిక్షణ కమిటీ ముందు తన వివరణ కూడా ఇచ్చుకున్నారు. పార్టీ అంతర్గత విషయాలను మీడియా ముందుకు తీసుకెళ్లడం, తోటి నాయకుడిపై బహిరంగ విమర్శలు చేయడం కూడా క్రమశిక్షణా రాహిత్యమేనని భావించిన అధిష్ఠానం ఆయనకు గతంలో నోటీసులిచ్చింది. తాజాగా షబ్బీర్‌అలీకి సైతం నోటీసులు జారీ అయ్యాయని పొలిటికల్ సర్కిళ్లలో చర్చ జరుగుతోంది. కాగా.. ఈ వివాదం ఇంకా ఎక్కడిదాకా వెళ్తుందోననే చర్చ కామారెడ్డిలో జరుగుతోంది.

## జిల్లాలో యాప్ ద్వారానే యూరియా సరఫరా..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో యూరియా పంపిణీని ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా నిర్వహిస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 1,29,824 మంది రైతులు 3,55,795 బస్తాలను కొనుగోలు చేశారని వీరస్వామి తెలిపారు. మండలం యూనిట్‌గా జిల్లాలోని అన్ని మండలాలకు కూడా ఈ సదుపాయం కల్పించామన్నారు. జిల్లాలో ప్రస్తుతం 23వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులకు సౌకర్యవంతంగా ఉండేటట్లు శాస్త్రీయంగా పంటలకు నత్రజని అందించే విధంగా ఈ యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు. రైతులంతా యాప్ విషయంలో ఏమైనా సమస్యలు తలెత్తినట్లయితే వ్యవసాయ విస్తీర్ణాధికారిని లేదా మండల వ్యవసాయ అధికారిని, సొసైటీలకు సంబంధించినటువంటి అధికారులను, వలంటీర్లను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో యూరియా పుష్కలంగా ఉందని.. ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు.



## బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** పేదలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే ధన్‌పాల్ అన్నారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఎల్‌వోసీ ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. నగరంలోని గౌతంనగర్‌కు చెందిన హేమగ్న మూత్రపిండాల వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతోందని.. దీంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో రూ.2.40 లక్షల ఎల్‌వోసీ అందజేశామన్నారు. పార్టీలకతీతంగా పేదల ప్రాణాలను కాపాడడమే తన లక్ష్యమన్నారు.

## షబ్బీర్ అలీ వాయిస్ వ్యవహారంపై విచారించండి..



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ పేరుతో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న వాయిస్ రికార్డింగ్‌లపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు ఎస్పీ రాజేష్ చంద్రకు ఫిర్యాదు చేశారు. కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి నేతృత్వంలో పలువురు నాయకులు ఎస్పీ, డీఎస్పీ, టౌన్ ఎస్‌హెచ్‌వోలను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. షబ్బీర్ అలీకి సంబంధించినవిగా చెబుతూ యూట్యూబ్, వాట్సాప్ గ్రూపులు, కొన్ని మీడియా సంస్థల్లో ప్రసారమవుతున్న ఆడియోలు ఫేక్ అని వారు వివరించారు. ఆయన వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే కుట్రపూరితంగా వీటిని సృష్టించారని ఆరోపించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కృత్రిమ మేధస్సు సాంకేతికతతో వాయిస్‌లను మార్ఫింగ్ చేయడం, ఎడిట్ చేయడం సులభమైందని, అందువల్ల ఆ ఆడియోల ప్రామాణికతను ఫోరెన్సిక్ పరీక్షల ద్వారా శాస్త్రీయంగా తేల్చాలని నేతలు కోరారు. వైరల్ అవుతున్న ఆడియోల మూలాలను గుర్తించి, అసలు ఫైళ్లను స్వాధీనం చేసుకోవాలన్నారు. తప్పుడు ఆడియోలు సృష్టించి ప్రచారం చేసిన వ్యక్తులపై, నిర్ధారణ కాకుండానే పదేపదే ప్రసారం చేసి ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్న మీడియా సంస్థలు, సోషల్ మీడియా నిర్వాహకులపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వ్యవహారంలో కుట్ర, పరువు నష్టం, ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశం ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు జరపాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూడెం శ్రీనివాస్ రెడ్డి, పాత రాజు, పండ్ల రాజు, గుడుగుల శ్రీనివాస్, రాజా గౌడ్, చాట్ల రాజేశ్వర్, భూమని బాలరాజు, ఇప్ప శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, సలీం, మీసాల రమేష్ పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి : మానాల మోహన్ రెడ్డి



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి మండలంలోని నర్సాపూర్‌లో మహిళా భవనానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో మహిళా సంఘాల కోసం కొత్త భవనానికి భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో మహిళలందరికీ పక్కాగా మహిళా భవనాలు ఉండాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రతి గ్రామంలో మహిళా భవన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. కమ్మర్‌పల్లి మండలంలో 14 గ్రామాలకు రూ.10 లక్షలు చొప్పున మహిళా భవనాలు మంజూరు కావడం జరిగిందని మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా గతంలో ఎప్పుడూ లేనట్లుగా తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. గతంలో రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు పావలా వడ్డీ వచ్చిందని ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి వచ్చాకే మహిళలకు పావలా వడ్డీ వస్తోందన్నారు. అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. నర్సాపూర్‌లో 23 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అందులో 8 పూర్తయ్యాయన్నారు. జిల్లాలో రైతులను ఫర్టిలైజర్ షాప్ ఓనర్లు ఇబ్బంది పెడితే నేరుగా తనకు ఫోన్ చేయాలని మానాల సూచించారు. రైతులకు అవసరం లేని ప్రొడక్ట్స్ అంటగట్టవద్దని ఫర్టిలైజర్ దుకాణదారులను హెచ్చరించారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు భాస్కర్, మాజీ అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

## విద్యార్థులను సొంత బిడ్డలుగా భావించాలి: కలెక్టర్





**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాలని.. ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల నిర్వహణలో లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టరేట్ లో విద్యాశాఖ అధికారులో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన, ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు నాణ్యతతో కూడిన విద్యను అభ్యసించేలా నిర్వాహకులు కృషి చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలలలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంతో పాటు ఆహార పదార్థాల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. ప్రతి పాఠశాల, వసతి గృహంలో డైట్ మెనూ పట్టికను విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ కమిటీలు చురుకుగా పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యా సంస్థలో స్వచ్ఛమైన, రక్షిత తాగునీటి సరఫరా ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్య రక్షణ విషయంలో రాజీ పడకూదని కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యా బోధన జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో వంద శాతం విద్యార్థుల నమోదు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఎస్‌డీవో రజిత, జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, ఆర్సీవో, సంబంధిత సంక్షేమ శాఖల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని నల్లూరు గ్రామంలో పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని సర్పంచ్ బర్కం గంగాధర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, రెండు జతల యూనిఫారాలు అందిస్తారన్నారు. రుచికరమైన మధ్యాహ్న భోజనం, వారానికి మూడుసార్లు గుడ్లు, రాగిజావ వంటి అనేక సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే విశాలమైన ఆటస్థలం, విద్యార్థులకు సరిపడా బెంచీలు, బాలబాలికలకు వేర్వేరు మరుగుదొడ్లు వంటి సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలలో ఉన్నప్పటికీ ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లడం సమంజసం కాదన్నారు. గ్రామ పాఠశాల అభివృద్ధి కోసం గ్రామంలోని విద్యావంతులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాలకు అవసరమైన సౌకర్యాల కల్పనలో ఈ కమిటీ చురుకుగా పని చేస్తుందని చెప్పారు. గ్రామంలోని పిల్లలందరూ తమ ఊరిలోనే చదివి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బర్కం లావణ్య, వార్డు సభ్యులు ప్రవీణ్ కుమార్, రాజు, శ్రీనివాస్, ఫణి గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, యువకులు, గ్రామ విద్యావంతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం ఉపాధి హామీ కూలీలతో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. గ్రామంలోని ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా సహకరించాలని తల్లిదండ్రులను కోరారు. పాఠశాల హెచ్ఎం రఘు మాట్లాడుతూ నాలుగేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, ఏకరూప దుస్తులు, వారానికి మూడు సార్లు రాగిజావ, మూడు కోడిగుడ్లు వంటి పలు సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తోందని వివరించారు. గతేడాది నుంచే కొత్తపల్లి పాఠశాలలో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభమైనట్లు గుర్తుచేశారు. గ్రామంలోని ప్రతిబడి ఈడు పిల్లవాడు పాఠశాలకు వెళ్లేలా గ్రామస్థులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# ముస్తాపూర్ గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



**అక్షరటుడే,లింగంపేట:** మండలంలోని ముస్తాపూర్ గ్రామం అభివృద్ధిలో పూర్తిగా వెనకబడి ఉందని.. అభివృద్ధికి సహరించాలని సర్పంచ్ రాధా నారాయణ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మదన్ మోహన్‌ను శనివారం సర్పంచ్ గ్రామస్థులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, మత్తడి కాల్వ పునర్నిర్మాణం చేపట్టాలని, గ్రామంలోని యువతకు క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని, గ్రామస్థుల అవసరాల మేరకు నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**ఆధార్, పాన్ కార్డు కావాలన్నా.. పాస్‌పోర్ట్, ఫాస్టాగ్, జీఎస్టీ, లేబర్ రిజిస్ట్రేషన్ వంటి సేవలు పొందాలన్నా ఒకప్పుడు కార్యాలయాల చుట్టూ, మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. అయితే భవిష్యత్తులో ఆ ఇబ్బందులు లేకుండా చేసేందుకు ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోనే సకల సేవలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది.**
**– అక్షరటుడే, భీమ్‌గల్**

# సహకార సంఘాల్లో సకల సేవలు



- **పీఏసీఎస్‌లలో కామన్ సర్వీసు సెంటర్లు**
- **ఇక ఒకేచోట ఆధార్, పాన్, పాస్‌పోర్ట్, ఈ-సేవలు**

గ్రామీణ ప్రాంతాల ప్రజలు, రైతులు ప్రభుత్వ సంబంధిత ఎలాంటి పనులు కావాలన్నా పట్టణాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. అయితే కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర సహకార శాఖ ద్వారా నిజామాబాద్ జిల్లాలోని పీఏసీఎస్‌లలో కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ) ఏర్పాటుకు ముమ్మర సన్నాహాలు జరుగుతున్నాయి.

### జిల్లావ్యాప్తంగా అన్ని సంఘాల్లోనూ..

ప్రస్తుతం పీఏసీఎస్‌లు కేవలం రుణాలు, ఎరువులు, విత్తనాల పంపిణీ, ధాన్యం కొనుగోలు వంటి వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకే పరిమితమయ్యాయి. వీటికి అదనంగా డిజిటల్ భారత్ పథకంలో భాగంగా గ్రామీణులకు అవసరమైన సామాజిక, సంక్షేమ, ఆర్థిక, విద్యా కోర్సులు, ఆరోగ్య సేవలను ఆన్‌లైన్‌లో అందించి ఉపాధి అవకాశాలను సృష్టించడానికి పీఏసీఎస్‌లను సీఎస్‌సీలుగా మార్చుతున్నారు. ఇందుకోసం కేంద్ర సహకార శాఖ, ఐటీ మంత్రిత్వ శాఖ, ఎలక్ట్రానిక్ పరిపాలన, నాబార్డులతో అవగాహన ఒప్పందం కుదిరింది.

### 72 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు..

జిల్లా పరిధిలో 72 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. మొదటి దశలో భాగంగా ఎంపిక చేసిన సంఘాల్లో త్వరలోనే సేవలు ప్రారంభించడానికి అధికార యంత్రాంగం లైసెన్సులు, ఐటీ మౌలిక వసతులను సిద్ధం చేస్తోంది. ఈ ఏడాది పూర్తి అయ్యేలోగా జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లోనూ పక్కాగా సీఎస్‌సీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని విద్యా, సహకార శాఖలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

### కలిగే ప్రయోజనాలు

కామన్ సర్వీస్ సెంటర్లు అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రజలకు ఒకే సూరకప్పు కింద వందలాది డిజిటల్ సేవలు లభిస్తాయి. వ్యవసాయం, డెయిరీ, మత్స్య పరిశ్రమ సమాచారంతో పాటు పీఎం కిసాన్, భూసార పరీక్ష కార్డ్, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పంట బీమా) వంటి సేవలు ఇక్కడే పొందవచ్చు. ఆధార్ కార్డు నమోదు/మార్పులు, పాన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, జనన మరణాల నమోదు సేవలు సులువవుతాయి. అలాగే ఆర్థిక, రవాణా సేవలైన డిజిటల్ సేవా పోర్టల్, ఫాస్టాగ్, జీఎస్టీ రికార్డులు, ఐటీ రిటర్నుల దాఖలుతో పాటు బస్సు, రైలు, విమాన టికెట్ల బుకింగ్ చేసుకోవచ్చు. సారాధి, వాహన్, ఈచలాన్, ఈస్టాంప్ వంటి రవాణా, రిజిస్ట్రేషన్ల సేవలు అందుతాయి. జీవన్ ప్రమాణ్ (లైవ్ సర్టిఫికేట్), పీఎం శ్రమయోగి మాన్‌ధన్ పెన్షన్ యోజన, ఉపకార వేతనాలు, సాధారణ జీవిత బీమా సేవలు లభిస్తాయి.

### జన ఔషధి కేంద్రాలుగానూ మార్పు!

పీఏసీఎస్‌లను 'జన ఔషధి కేంద్రాలు'గా కూడా మార్చడానికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. వీటికి ప్రత్యేకంగా లైసెన్సులు జారీ చేసి తక్కువ ధరకే లభించే నాణ్యమైన జనరిక్ ఔషధ విక్రయాలకు కూడా అనుమతిస్తారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల వైద్య ఖర్చులు భారీగా తగ్గనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, న్యాయ, పర్యాటక, విద్యా, నైపుణ్యాభివృద్ధి తదితర సేవలను ఒకే చోట అందించడం ద్వారా నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాలు ఇకపై గ్రామీణ ఆర్థిక, సేవా విప్లవానికి కేంద్ర బిందువులుగా మారనున్నాయి.

# త్వరలో ఆర్టీసీ డిపోల్లో యూనియన్ వెరిఫికేషన్ ప్రక్రియ: ఆర్ఎం



**అక్షరటుడే, ఇందూరు:** త్వరలో ఆర్టీసీ డిపోల్లో యూనియన్ వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆర్టీసీ ఆర్ఎం మూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. గతేడాది ఏప్రిల్‌లో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేసిన సమయంలో ప్రభుత్వం కొన్ని హామీలు ఇచ్చిందన్నారు. వీటిని క్యాబినెట్ సబ్ కమిటీ పరిశీలించి సానుకూలంగా ముందుకు వెళ్తోందని వివరించారు. 2021 వేతన సవరణ చట్టం ప్రకారం.. యూనియన్ల పునరుద్ధరణ ఆర్టీసీ సంస్థను వీలీనం చేసే అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన వివరించారు. విలీన ప్రక్రియను అత్యంత ప్రాధాన్యకరమైన అంశంగా ప్రభుత్వం చూస్తోందన్నారు. ఈ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఉన్నత స్థాయి కమిటీని సైతం ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ కమిటీ ఇప్పటికే ప్రత్యేకంగా సమావేశమై విలీనానికి సంబంధించిన అన్ని సాంకేతిక ఆర్థిక పరిపాలన పరమైన అంశాలపై లోతైన సమీక్ష చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా సమ్మె కాలంలో మిగిలిన డిమాండ్లపై ఆర్టీసీ ఈడీలతో కూడిన కమిటీ కార్మిక సంఘాలతో చర్చలు జరుపుతుందని ఆయన వివరించారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**అక్షరటుడే, బాల్కొండ:** మండల పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శైలేందర్ తెలిపారు. అతడి వయస్సు 45 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. అతడి షర్ట్‌పై 'క్షత్రియ' అని రాసి ఉందని.. వివరాలు తెలిసిన వారు బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై కోరారు.








# సైక్లింగ్‌తో ఆరోగ్యం సమతుల్యం

**అక్షరటుడే, ఇందూరు:** సైక్లింగ్ చేయడంతో ఆరోగ్యం సమతుల్యంగా ఉంటుందని జిల్లా యువజన, క్రీడల అధికారి పవన్‌కుమార్ అన్నారు. ఖేలో ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ సౌజన్యంతో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అస్మిత మహిళా సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరల్డ్ బైస్కిల్ డేను జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సైక్లింగ్‌తో గుండె ఆరోగ్యం మెరుగుపడడం, బరువు తగ్గడం, ఒత్తిడి తగ్గడం, రోగనిరోధక శక్తి పెరగడం వంటి అనేక శారీరక, మానసిక ప్రయోజనాలు కలుగుతాయని సూచించారు. ఇది కీళ్లపై తక్కువ ప్రభావం చూపే వ్యాయామం, కాబట్టి అన్ని వయసుల వారికి, ముఖ్యంగా ఫిట్‌నెస్ కోసం సైక్లింగ్ చాలా మంచిదన్నారు. జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కృపాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భూలోక విజయ్ కాంత్ రావు మాట్లాడుతూ 'అస్మిత' కార్యక్రమం ముఖ్య ఉద్దేశం మహిళలపై దృష్టి సారించిన ఒక సైక్లింగ్ కార్యక్రమమన్నారు. సైక్లింగ్‌లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, వర్ధమాన ప్రతిభను గుర్తించడం, ఫిట్‌నెస్, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం ఈ పోటీ ముఖ్య లక్ష్యాలు అని చెప్పారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, యూనివర్సిటీ క్రీడాకారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారిణిలకు మెడళ్లు అందజేశారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి తహశీల్దార్ సతీష్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు సూర్య ప్రకాష్, రాజ్ కుమార్ సుబేదార్, కుంట గంగారెడ్డి, జాయింట్ సెక్రెటరీలు రాకేష్, ఆకుల నారేష్, దుర్గ మల్లేష్ గాజుల శేఖర్, గడ్డం రవి తెలంగాణా యూనివర్సిటీ పీడీ నేత స్వామి కుమార్ తదితరులు పాల్గొన్నారు. గెలుపొందిన వారిలో.. నవతే మేఘన, బ్రీందా, జస్విన, రిషిత, అనుష్క, లాస్య, శిల్పా చవాన్, పవిత్ర, శృతిలయ ఉన్నారు.

# బీర్కూర్‌లో దొంగల హల్‌చల్.. తాళం వేసిన ఇంట్లో చోరీ



**అక్షరటుడే, బాన్సువాడ:** తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటన బీర్కూర్ మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్‌కు చెందిన వడ్ల రాజు కొత్త ఇంటి నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో ప్రస్తుతం కిరాయి ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అయితే తన పాత ఇంటికి తాళం వేసి ఉంచాడు. గురువారం రాత్రి ఆలస్యంగా ఇంటి వద్దకు వెళ్లిన రాజు ఇంటి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టబడి ఉండడాన్ని గమనించాడు. అనుమానం రావడంతో లోపలికి వెళ్లి పరిశీలించగా ఇంట్లోని సామన్లు చిందరవందరగా పడి ఉండడంతో పాటు బీరువా తెరిచి ఉండడం కనిపించింది. బీరువాలో భద్రపర్చిన సుమారు 3 తులాల బంగారు ఆభరణాలు, 13 తులాల వెండి ఆభరణాలు, రూ.1.20 లక్షల నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. సంఘటనా స్థలం వద్ద ఆధారాలను సేకరించి పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# అంత్యక్రియలకు కానిస్టేబుల్ ఆర్థికసాయం



**అక్షరటుడే, కామారెడ్డి:** పోలీసుశాఖలో విధులతో పాటు మానవత్వాన్ని చాటుకున్నాడు ఓ కానిస్టేబుల్. పక్క తండాలో ఓ వ్యక్తి చనిపోగా ఆర్థిక పరిస్థితి తెలుసుకుని ఆపన్నహస్తం అందించాడు. మాచారెడ్డి మండలం పందిమడుగు తండాకు చెందిన బుక్యా శ్రీను శనివారం మృతి చెందాడు. కుటుంబ పరిస్థితి బాగా లేకపోవడంతో అంత్యక్రియలు చేయలేని పరిస్థితి నెలకొంది. జుక్కల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్తేబుల్‌గా పని చేస్తున్న పక్క గ్రామమైన ఎల్లంపేటకు చెందిన శ్రీనివాస్ నాయక్ అంత్యక్రియలకు రూ.5వేల ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని ఇచ్చారు. మృతి చెందిన శ్రీనుకు భార్య జున్ను, ఇద్దరు కుమారులైన మహేందర్, వీరేందర్‌లకు నేనున్నా అంటూ భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం చేసిన కానిస్టేబుల్ శ్రీను నాయక్‌ను తండావాసులు, నాయకులు అభినందించారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ పద్మశాలి అభివృద్ధి కమిటీ కార్యవర్గం ఎన్నిక



**అక్షరటుడే, ఇందూరు:** కొండా లక్ష్మణ్ బాపూజీ పద్మశాలి అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నగరంలోని సంఘం కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల అధికారి చౌటి భూమేశ్వర్ పర్యవేక్షణలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పెంట దత్తాద్రి, సలహాదారులు అమృతాపూర్ గంగాధర్, ఎస్ఆర్ సత్యపాల్, బిల్ల మహేష్, బొట్టు వెంకటేష్ సమక్షంలో ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. కార్యవర్గం 2026 నుంచి 2028 వరకు రెండేళ్ల కాలపరిమితితో బాధ్యతల్లో కొనసాగనుంది. పద్మశాలి సామాజికవర్గ అభివృద్ధికి, సంస్థ నియమావళికి లోబడి నిబద్ధతతో సేవ చేస్తామని నూతన సభ్యులు స్పష్టం చేశారు. అధ్యక్షుడిగా భీమర్తి రవి, ప్రధాన కార్యదర్శిగా కొండవత్రి రాజేందర్ (లక్కోర), కోశాధికారిగా మేక శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా క్యాతం జగన్‌మోహన్, తేలి ప్రదీప్, చిలువేరి గణేష్, సహాయ కార్యదర్శులుగా ఇరుముల్ల శివలింగం, సురుకుట్ల భాస్కర్, అంకం రాజేందర్, ప్రచార కార్యదర్శిగా పల్నాటి రఘు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ధోర్నాల రవి, ఈసీ మెంబర్లుగా శ్రీరాం దత్తాద్రి, గోవిందరాజులు, గంగుల రవి, గుండెల్లి కృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు.